## కథ

# ఎత్తుకి పై ఎత్తు

**పాలగుమ్మి రామకృష్ణారావు**

**రామనాథాన్ని చూడగానే "నమస్కారం మేష్టారు. రండి, కూర్చోండి" అంటూ ఆహ్వానించాడు బ్యాంకు మేనేజరు. అటెండరును కాఫీకి పంపించాడు.**

**"చెప్పండి మాస్టారు, పెన్షన్ వస్తుందా? అమ్మాయికి పెళ్లి కుదిరిందా? ఫిక్సెడ్ డిపాజిట్ తియ్యడానికొచ్చారా?" వరుస ప్రశ్నలు వేశాడు మేనేజరు.**

''ఆ. అవును. కాదు'' రామనాథం అన్నిటికి పొడిపొడిగా సమాధానాలిచ్చాడు. కౌంటర్లలో కస్టమర్లతో కుస్తీ పడుతున్నారు బ్యాంకు సిబ్బంది. మేనేజరు అద్దాల గదిలోంచి చూస్తోంటే అదంతా మాకే చిత్రంలా అనిపించింది. మేనేజరుకు అది నిత్య నిశ్శబ్ద వీక్షణం. అటెండరు రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చాడు.

''మీరు మా కస్టమరు. కాఫీ తీసుకోండి మాస్టారు. సందేహించకండి'' మేనేజరు ఆ మాట అన్నాకా కప్పు అందుకున్నాడు. ఇప్పుడు కాస్త మనసు స్థిమితపడింది. 'అవును, తను ఈ బ్యాంకు కస్టమర్. తన అవసరాన్ని చెప్పుకునే స్వతంత్రం ఉంది అనుకున్నాడు' కాస్త ధైర్యంగా.

కాఫీ తాగడం పూర్తయ్యాక ''చిన్న పనుండి వచ్చాను'' అన్నాడు.

మేనేజర్ నవ్వుతూ అన్నాడు. ''చిన్నదయినా పెద్దదయినా మాకు చేతనయిన సహాయం చెయ్యడం మా ధర్మం. చెప్పండి.''

''ఏం లేదండి. ఆ నాయుడు లేడూ- అదే రాఘవులునాయుడు. ఆయనకు రెండు లక్షలు అప్పు ఇచ్చాను. నాలుగు సంవత్సరాల నుండి వడ్డీ కూడా బాకీ ఉంది.''

''ఇందులో మేం చెయ్యగలిగిందేమిటి?''

''నాయుడికి పక్క ఊర్లో ఒక ఇల్లుంది. అది అమ్మకానికి పెట్టాడు. నాకు తెలిసిన వ్యక్తికి రెండున్నర లక్షలకు బేరం కుదిర్చాను.''

''అయితే?''

''ఆ అమ్మకం సొమ్ము డ్రాఫ్టు ద్వారా చెల్లించే ఏర్పాటు చేశాను. నాయుడు నాకు మాటిచ్చాడు. ఆ ఇల్లు అమ్మగానే నా బాకీ తీరుస్తానని. ఆ డ్రాఫ్టు అందగానే నాకు చెక్కు రాసిస్తాడు.

''ఇంకే- మొండి బాకీని ఏదోరకంగా సాధించుకొస్తున్నారు. తప్పకుండా మీ చెక్కు క్యాష్ అయ్యేలా చేస్తాం. కానీ ఒక్కమాట. మీ కంటే ముందుగా నాయుడుగారు డ్రా చేసుకుంటే నేనేం చెయ్యలేను.''

''పైన ఆ దేవుడున్నాడు'' మేనేజరుకు నమస్కారం పెట్టి లేచాడు రామనాథం.

బయట ఎండ ఎక్కువగా ఉంది. గొడుగు తెరచి మెల్లగా ఇంటివైపు నడిచాడు. మనసంతా ఆలోచనలు కమ్ముకున్నాయి. అలవాటుగా రహదారిలో అడుగులు పడుతున్నాయి.

రిటైర్మెంట్ ద్వారా మొత్తం ఐదు లక్షల పైగానే వచ్చింది. మొదట్లో చెక్కుల్ని బ్యాంకులో జమచేశాడు. బ్యాంకు మేనేజరు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వెయ్యమని అనేక విధాలు చెప్పాడు. నెలనెలా వడ్డీ వచ్చే స్కీములు కూడా చూపాడు. అమ్మాయి పెళ్లి చెయ్యాలని, వాటిని తనే తిరస్కరించాడు. అప్పుడే రాఘవులునాయుడు స్వయంగా ఇంటికి వచ్చి ఐదు లక్షలు నెలకు రెండు రూపాయలు వడ్డీ మీద అప్పు అడిగాడు. అంటే నెలకు పది వేలు వడ్డీ.

భార్య శాంతమ్మ ఒప్పుకోలేదు. అమ్మాయిని ఒక ఇంటిదాన్ని చేశాకే ఏదైనా అని మొండిపట్టు పట్టింది. తనకు వడ్డీమేర ఆశ చావడం లేదు. ఎవరేమన్నా లెక్కచెయ్యక అతికష్టం మీద రెండు లక్షలు బ్యాంకు నుండి తీసి నాయుడికి అప్పిచ్చాడు.

ఒక నెల తిరిగిన తరువాత నాయుడ్ని వడ్డీ అడిగితే ''ఎందుకు పంతులు కంగారు? పిల్ల పెళ్లి కుదుర్చుకో. అంతవరకు వడ్డీ మీద వడ్డీ వస్తుందిగా'' అన్నాడు. నిజమే అనిపించింది.

రోజులు గడుస్తున్నా సంబంధం కుదరలేదు. బ్యాంకు మేనేజరు సలహాతో మిగిలిన డబ్బు ఒక సంవత్సరానికి ఫిక్సెడ్‌లో మార్చాడు. అమ్మాయి తలరాతో, రామనాథం కాళ్ల శనో అర్థం కానట్లు సంవత్సరాలు మారుతున్నా మంచి సంబంధం దొరకలేదు. ఇంటి అవసరాలున్నా బ్యాంకులో డబ్బు తియ్యాలంటే భయం. నాయుడిగార్ని వడ్డీ అడిగితే మొహం చాటెయ్యడం మొదలుపెట్టాడు. పెన్షన్ డబ్బుతో సర్దుకుంటూ ఇల్లు నడపవలసి వచ్చేది.

అనుకోకుండా బంధువుల సాయంతో ఒక రోజు మంచి సంబంధం వచ్చింది. ముందు వెనుక ఆలోచించకుండా అడిగినవన్నీ ఒప్పుకొంటూ రామనాథం సంబంధం ఖాయం చేసుకున్నాడు. ఈసారి నాయుడ్ని గట్టిగా అడిగాడు అసలు, వడ్డీ ఇచ్చెయ్యమని.

నాయుడు చేతులు పైకెత్తేశాడు.

''ఇప్పుడేం ఇచ్చే స్థితిలో లేను మాస్టారు. వ్యాపారం నష్టాల్లో ఉంది. కొన్నాళ్లు ఓపిక పట్టండి. వ్యాపారమో ఆస్తులో అమ్ముకుని మీ బాకీ తీరుస్తాను.''

''మరి నా పిల్ల పెళ్లేం చెయ్యను?''

''మీ బాకీ ఎగ్గొడతానని చెప్పడం లేదుగా పంతులు. ఇస్తాను. పాతికేసి లక్షలు అప్పులిచ్చిన వాళ్లే నన్నింత గట్టిగా అడగటం లేదు.''

లక్షల మీద అప్పులున్నాయని చెప్పగానే రామనాథం గుండె దడదడలాడింది. ఇప్పుడు గట్టిగా అడిగే ధైర్యం కూడా పోయింది. ''అయ్యా నేను సామాన్యుడ్ని. నన్ను ముంచెయ్యకండి'' వణుకుతున్న కంఠంతో అన్నాడు.

''తప్పకుండా ఇస్తానని చెబుతున్నానుగా, ఈ పక్క ఊళ్లో నాకో చిన్న ఇల్లుంది. అమ్మితే నాలుగు లక్షలు వస్తుంది. అది అమ్మకానికి పెట్టాను'' రామనాథం నమస్కారం పెట్టి బయటకొచ్చాడు.

అప్పటి నుంచి రోజూ నాయుడ్ని కలుస్తూనే ఉన్నాడు. ఎన్నిసార్లయినా సమాధానం అంతే. ఆ పల్లెటూర్లో ఈయన ఇల్లు కొనేదెవరు? తన బాకీ వచ్చేదెప్పుడు?

నాయుడిలాంటి ఒక వ్యక్తి ఇంగ్లీషులో ఇచ్చిన జవాబు గుర్తుకొచ్చింది. ''ఐ హేవ్ నో ఇంట్రేస్టు టు పే ప్రిన్సిపల్. ఐ హేవ్ నో ప్రిన్సిపల్ టు పే ఇంట్రేస్టు.''

నెలకు నాలుగు వేల వడ్డీ నాలుగు సంవత్సరాలలో రెండు లక్షలు దాటిపోయింది. డబ్బులు రానంతవరకు పిల్లల లెక్కల పుస్తకాల్లో అంకెలకు వీటికి తేడా ఏం లేదనిపించింది. నాయుడి ఇంటికి తనే బేరం చూపెడితే బాగుంటుందనిపించింది. అనిపించడమే తడవుగా ఊరంతా ప్రచారం చేశాడు. పక్క ఊళ్లల్లో తెలుసున్నవాళ్లకు కబురు పంపించాడు. శ్రమ ఫలించి ఒక కస్ట



మర్ దొరికాడు. తన సహోధ్యాయుడు శంకరయ్యగార్కి ఇల్లు కొనాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. తన బాకీ రాబట్టుకునేందుకు ఇది మంచి అవకాశంగా భావించాడు రామనాథం.

శంకరంగార్కి ఆ ఇల్లు చూపించాడు. తన బాధ దాపరికం లేకుండా చెప్పుకున్నాడు. ఆయనకు ఆ ఇంటి పరిసరాలు నచ్చాయి. ఇల్లయితే శిథిలావస్థలో ఉంది. కొంచెం బాగుచేసుకుంటే సామాన్య కుటుంబం ఆ ఇంట్లో కాలక్షేపం చెయ్యచ్చు. అందుకే శంకరయ్యగారు ముందుకు వచ్చి రెండు లక్షలకు అడిగారు. నాయుడితో బేరాలాడి అతికష్టం మీద రెండు లక్షల యాభై వేలకు ఖాయం చేశారు.

ముందుగా రామనాథంతో మాట్లాడి నిర్ణయించినట్లుగా మొత్తం డబ్బు డ్రాఫ్టు చేసి రిజిస్ట్రేషన్ రోజున ఇస్తానన్నారు శంకరయ్య. అవకాశం వచ్చినప్పుడల్లా నాయుడికి నమస్కారం పెట్టడం మానలేదు రామనాథం.

''ఆరోజే నీక్కూడా చెక్కు ఇస్తాలే పంతులు'' అని హామీ ఇచ్చాడు నాయుడు. ఎందుకైనా మంచిదని ముందుగానే బ్యాంకు మేనేజర్‌తో ఒక ముక్క చెప్పి వస్తున్నాడిప్పుడు.

నాయుడి ఇల్లు అమ్మకం సెటిల్ అయిన సంగతి ఆ ఊరి మొత్తం మీద తెలిసింది ఒక్క బ్యాంకు మేనేజరుకు మాత్రమే. మరెవ్వరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాడు రామనాథం. తెలిస్తే మిగిలిన అప్పులవాళ్లు ఆ సొమ్మును ఎగరేసుకుపోతారన్న భయం.

రిజిస్ట్రేషన్ రోజున శంకరయ్యగారి చేత ముందుగా డ్రాఫ్టు చేయించి రిజిస్ట్రారాఫీసుకు చేరారు. అనుకున్న ప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తయింది. రామనాథం మరోసారి నమస్కారం పెట్టి ''నాయుడుగారూ- నాకూ సెటిల్ చేసేస్తే'' అంటూ నసిగాడు.

''నీ రెండు లక్షలేగా పంతులూ?''

''వడ్డీ...'' ధైర్యంగానే అడిగాడు రామనాథం. నాయుడు గట్టిగా నవ్వాడు. ''నువ్వు గుడ్డివాడివేనయ్యా పంతులు. ప్రస్తుతానికి వడ్డీ మొత్తానికి ఇవ్వలేను.''

''ఏదో ఒకటి సెటిల్ చేసెయ్యండి. ఈ నెలలోనే అమ్మాయి పెళ్లి.''

నాయుడు చెక్కుబుక్కు తీసి రెండు లక్షల అరవై వేలకు చెక్కు రాసి రామనాథం చేతిలో పెట్టాడు. ''ఇక్కడితో మన మధ్య వ్యవహారం సెటిల్ చేసుకుందాం. అరవై వేలకు మించి వడ్డీ ఇవ్వలేను.''

రామనాథం అసలుతో బాటు కొంతయినా వడ్డీ ముట్టినందుకు సంతోషించాడు. ఆఖరి నమస్కారంతో శతకోటి నమస్కారాలు పూర్తి చేసి బయటపడ్డాడు. ఇన్నాళ్లు అనుభవించిన మానసిక వేదన ఒక్కసారి పటాపంచలయింది.

అమ్మాయి పెళ్లికి ఇంక అడ్డుండదు. మిగిలిన డబ్బు బ్యాంకులో దాచుకుంటే భవిష్యత్తులో అవసరాలకు పనికొస్తుంది. ఇక జీవితంలో వడ్డీలకాశ పడి ఎవరికీ అప్పులు ఇవ్వకూడదు అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

మర్నాడు ఉదయం పది గంటలకు బ్యాంకుకు చేరుకుని మేనేజర్ని కలిశాడు రామనాథం. మేనేజర్ లెడ్జరు తెప్పించి నాయుడి ఖాతా చూశారు.

''డ్రాఫ్ట్. ఇంకా జమ చేయలేదండి.''

రామనాథం మళ్లీ నీరుగారిపోయాడు. ''భగవంతుడా! ఇదేవిటి? మళ్లీ పరీక్షా!'' నమ్ముకున్న దేవుళ్లకు మొక్కుతో బ్యాంకు ఆవరణలోనే మతి స్థిమితం లేనివాడిలా తిరగసాగాడు. దూరంగా నాయుడు ఇటే రావడం చూసి ''హమ్మయ్య'' అని ఊపిరి పీల్చుకుని మేనేజరు రూంలోకి పరిగెత్తాడు.

మరో అరగంట ఆగి మేనేజరు మరోసారి లెడ్జరు తెప్పించారు. ఈసారి నాయుడు డ్రాఫ్టు జమచేశాడు.

''ఓకేనండి మీరు చెక్కు తెచ్చారా?''

''ఇదిగో సార్'' ఒక్క ఉదుటున బాగ్ లోంచి చెక్కు తీసి మేనేజర్ చేతిలో పెట్టాడు. మేనేజరు కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

రామనాథానికి అనుమానం వచ్చింది. తను మరోసారి మోసపోతున్నాడా?

''ఏంసార్! నా డబ్బు రాదా?- చెప్పండి సార్. చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా ఏదయినా అనుభవించక తప్పదు.''

''సారీ రామనాథంగారు, నాయుడిగారి ఎకౌంటులో బాలన్స్ సరిపోదు. వారు మీకు రెండు లక్షల అరవై వేలకు చెక్కు రాశారు. వారు జమ చేసింది రెండు లక్షల యాభై వేలు. పాత బాలెన్స్ ఒక వెయ్యి మాత్రమే ఉంది.''

రామనాథానికి పూర్తిగా అర్థమయింది. ఇల్లు అమ్మిన రేటు కన్నా పదివేలు ఎక్కువ చెక్కు రాసినపుడు అది కేవలం వడ్డీ సెటిల్మెంటనుకున్నాడు. కానీ నాయుడి మనసులో ఇంత దురాలోచన ఉందనుకోలేదు. తన న్యాయమైన సంపాదన వెనక్కు తీసుకోవడానికి పడ్డ ఇంత శ్రమ వృధా అయింది.

ఇంక తను బతికుండగా నాయుడి నుంచి బాకీ వసూలు చేయడం అసంభవం. రామనాథానికి ముచ్చెమటలు పోశాయి.

మేనేజరు రామనాథం పరిస్థితి చూసి కంగారు పడ్డాడు. మరోసారి కాఫీ తెప్పించి ''తాగండి రామనాథంగారు, కాస్త స్థిమితపడండి. జీవితంలో మోసగాళ్లను నమ్మి నష్టపోయినవాళ్లు మీరొక్కరే కాదు. అందర్లో మీరొకరు. జాతీయ బాంకు, పోస్టాఫీసులు ఎన్నున్నా బయట వ్యక్తుల ప్రలోభాలకు ఇలా మోసపోవడం ఈ రోజుల్లో చాలా మామూలు విషయం అయిపోయింది. తాము మోసపోయామన్న విషయం, పరిస్థితులు తమ చెయ్యి దాటిపోయాకానే తెలుస్తుంది'' మేనేజరు ఓదార్పుగా అన్నాడు.

''నిజం చెప్పారు మేనేజరుగారు. మళ్లీ ఈ వయసులో ఎక్కడో నాలుగు ప్రైవేట్లు చెప్పుకుంటే కానీ ఇంటి బాధ్యతలు తీరవు'' కుర్చీలోంచి జీవశ్ఛవంలా లేచాడు.

''రామనాథంగారూ, మరోమాట. ఈ చెక్కును డిపాజిట్ చేసిన తరువాత నగదు రాకపోతే మీరు కోర్టుకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది.''

''అయ్యా- నాయుడు చుట్టూ తిరగడానికి నా శేషజీవితం సగం ఖర్చయిపోయింది. మిగిలింది కోర్టు చుట్టూ తిరగడానికా? మళ్లీ అదో ఖర్చు. క్షమించండి. నాకు ప్రాప్తం లేదనుకుంటాను'' రామనాథం తలుపు వేసి రూం బయటకు అడుగుపెట్టాడు.

''రామనాథంగారు ఒక్క క్షణం-'' మేనేజరు పిలుపుతో వెనక్కు తిరిగి చూశాడు రామనాథం.

''రండి, మరో మార్గం చెపుతాను'' గాలిలో రెపరెపలాడుతున్న దీపానికి చెయ్యి అడ్డం పెట్టినట్లుగా అయింది. రామనాథం వచ్చి కూర్చున్నాడు.

''మీదగ్గర తొమ్మది వేలున్నాయా?''

''ఎందుకు?''

''ఉంటే నాయుడు ఎకౌంటులో కట్టెయ్యండి.''

''నేనిచ్చిన డబ్బుకు నేనే వడ్డీ కట్టాలంటారా!''

''అది కాదు మాస్టారు. నాయుడు ఖాతాలో తొమ్మిది వేలు మాత్రమే తక్కువ ఉన్నాయి. ఆ డబ్బు మీరు కట్టేస్తే మొత్తం రెండు లక్షల అరవై వేలు అవుతుంది. మీ చెక్కు కాష్ చేసుకోవచ్చు. మీరు ఈ పనిని ఎంత త్వరగా చేస్తే అంత మంచిది. వేరే ఎవరైనా ఆయన ఎకౌంట్లోంచి డబ్బు తీసుకుంటే అప్పుడు ఇంకా కష్టం.''

''మీ బ్యాంకులో నా డబ్బు మొత్తం ఫిక్స్డ్ డిపాజిట్లో ఉంది. మరో నెల ఆగితే కానీ రావు.''

''దానిమీద లోన్కు అప్లయి చేయండి.''

దారి చూపించాడు మేనేజరు. పనులు చకచకా జరిగిపోయాయి. నాయుడు ఎకౌంట్లో తొమ్మిది వేలు జమ అయింది. క్షణాల్లో బాలెన్స్ నిల్ అయి రామనాథం ఎకౌంటుకు మారింది.

రామనాథం ఇదంతా కలా నిజమా అన్నట్లు చూస్తూ ఉండిపోయాడు. ''ఇంక మీ అమ్మాయి పెళ్లి దివ్యంగా చెయ్యొచ్చు'' షేక్ హాండిచ్చాడు మేనేజరు. రామనాథం ఆయన చెయ్యి వదలకుండా జలజలా కన్నీళ్లు కార్చాడు.

మరో రోజు నాయుడు రెండువేలు కాష్ డ్రా చేయడానికొచ్చి ఎకౌంటులో నిల్ బాలన్స్ చూసి కళ్లు తేలేశాడు.

## అన్నిపాత్రలకీ రెడీ

**'బొమ్మరిల్లు'తో ప్రేక్షకాభిమానాన్ని పొందిన అందాలభామ జెనీలియా ఇప్పుడు ఢీతో జనంముందుకి వచ్చింది. బొమ్మరిల్లుతో కొత్తదనంతో కూడిన పాత్రని పోషించిన ఈ భామ తెలుగులో మరింత విజృంభించే అవకాశాలు కన్పిస్తున్నాయంటున్నారు. ఆ సంగతే ఆమెని అడిగితే 'ప్రేక్షకులు కోరుకునే పాత్రలు చేయడానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను' అంటోంది. అన్నట్టు 'సత్యం' సినిమాకి ఇప్పటికీ ఆమెలో మార్పు కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.**

